## క్లుప్తంగా

### యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ రమేశ్

లింగాపూర్ : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జైనూర్ సీఐ రమేశ్, లింగాపూర్ ఎస్సై గంగన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీలో డ్రగ్స్ నిర్మూలన, మాదక ద్రవ్య రహిత సమాజం, పోలీస్ మిత్రపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉందన్నారు. ప్రతీ విద్యార్థి ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలన్నారు.

### ప్రతీ ఇంటికి నీటిని సరఫరా చేయాలి



మాట్లాడుతున్న రవీందర్

పెంచికల్‌పేట్: ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని మిషన్ భగీరథ ఎస్‌ఈ రవీందర్ అన్నారు. మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో గురువారం పర్యటించి మిషన్ భగీరథ నీటి సరఫరా జరుగుతున్న తీరును గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రోజు నీటి సరఫరా చేయాలని సూచించారు. అంతకు ముందు గ్రామంలోని మంచి నీటిని ట్యాంకును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట గ్రిడ్ డీఈ పృథ్వీ, ఏఈ మనోహర్, ప్రణీత్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



బోధన పరిశీలిస్తున్న ఎంఈవో ఆడే ప్రకాశ్

కెరమెరి: విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నా రు. గురువారం మండలంలోని కెలిబి పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల రిజిస్టర్లను పరిశీలించారు. అన్ని రకాల రికార్డులను విధిగా నమోదు చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సోము, ఉపాధ్యాయులు శ్రీధర్, రమ్యకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### వరినాట్లు వేసిన విద్యార్థులు



వరినాట్లు వేస్తున్న విద్యార్థులు

పెంచికల్‌పేట్: మండలంలోని ప్రాథమికోన్నత బొంబాయిగూడ పాఠశాల విద్యార్థులు గురువారం క్షేత్ర పర్యటనలో భాగంగా వరి పొలాలను సందర్శించారు. వరి సాగు విధానాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు, కూలీలతో కలిసి విద్యార్థులు వరినాట్లు వేశారు. ప్రాజెక్టులో భాగంగా విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాలను కల్పించేందుకు క్షేత్ర పర్యటనకు తీసుకుని వచ్చినట్లు ఉపాధ్యాయులు జాఫర్, అనిల్ తెలిపారు.

### అటవీ భూముల్లో పోడు సాగు చేయొద్దు



పుష్పగుచ్ఛం ఇస్తున్న రేంజ్ అధికారి భానేష్

రెబ్బెన: అటవీ భూముల్లో పోడు సాగు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆసిఫాబాద్ ఎఫ్‌డీవో దేవీదాస్ అన్నారు. రెబ్బెన రేంజ్ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజ్ అధికారి భానేష్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. సెంట్రల్ నర్సరీ నిర్వహణ, ఎన్‌క్రోస్‌మెంట్, వన్యప్రాణుల సంరక్షణ గురించి సిబ్బందితో చర్చించారు. అనంతరం మండల కేంద్రంలోని సెంట్రల్ నర్సరీ, ప్లాంటేషన్‌తోపాటు రాజారంలోని ఫారెస్ట్ రెట్రీవల్ భూములను సందర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్వో చంద్రమోహన్, ఎఫ్‌ఎస్‌వో రవి, సిబ్బంది పాల్గొన్నారు.

### బైక్ చోరీ

బెజ్జూర్: పార్కింగ్ చేసిన బైక్ చోరీకి గురైనట్లు మండల కేంద్రానికి చెందిన రామగిరి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం రాత్రి తన ఇంటి ముందు ఉంచిన బైక్ (టీఎస్ 20 633) గుర్తు తెలియని వారు దొంగలించినట్లు పేర్కొన్నారు.

# పారిశుద్ధ్యంతోనే ఆరోగ్యం

- వ్యాధుల నివారణ దిశగా చర్యలు
- జాగ్రత్తలు తీసుకుంటున్న గ్రామ సచివాలయాలు



కొఠారిలో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది



భోలాపటార్‌నిల్వ ఉన్న నీటిలో ఆయిల్‌బాల్ వేస్తున్న సిబ్బంది

కెరమెరి: ఇటీవల అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండేందుకు ఆయా గ్రామాల్లో కార్యదర్శులు చర్యలు తీసుకుంటున్నారు. వారంలో రెండుసార్లు డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు. పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమయ్యారు. ఎప్పటికప్పుడు తమ పరిధిలోని గ్రామాలను సందర్శించి పరిసరా ల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా రు.

**ప్రతీ రెండు రోజులకోసారి..**

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జనాభా 33 వేలు ఉండగా ఓటర్లు మాత్రం 18,970 మంది ఉన్నారు. ఆయా గ్రామ పంచాయతీలో ప్రతీ రెండు రోజులకోసారి డ్రెయినేజీలు శుభ్రం చేస్తున్నారు. ఎక్కడా కూడా మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు చేపడుతున్నారు. బుషేస్ కటింగ్, పెంటకుప్పల తొలగింపు, ప్రధాన రోడ్ల కిరువైపులా శుభ్రం చేయడం, పిచ్చి మొక్కల తొలగింపు, ప్రతీరోజు ట్రాక్టర్ ద్వారా నిల్వ ఉన్న చెత్తను తొలగించడం లాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. మురికి నీటిలో లార్వా లేకుండా టెమిపాస్ ద్రావణం వేస్తున్నారు. సాయంకాలం ఫాగింగ్ చేస్తున్నారు. మంగళవారం, శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహిస్తున్నారు.

**రోజువారి కార్యక్రమాలు ఇవి**

ఇప్పటికీ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రతీరోజు మురుగునీటిలో ఆయిల్‌బాల్స్ వేయడం, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడడం, పాత టైర్లు, డబ్బాలు, డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయడం, శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేయడంలాంటి పనులు చేస్తున్నారు. వ్యాధుల నివారణపై గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్నారు. మండలానికి 200 బ్లీచింగ్ పౌడర్ బ్యాగులు, బైలార్వా 32 బాక్స్‌లు పంపిణీ చేశారు. సున్నం బ్యాగుల కోసం ఆర్డర్ పెట్టినట్లు అధికారులు పేర్కొన్నారు.

### పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు గ్రామ కార్యదర్శుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాం.

– అంజద్‌పాషా, ఎంపీడీవో

## నాణ్యమైన విద్యనందించేందుకు చర్యలు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



విద్యార్థులతో కలిసి నిద్రిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

రెబ్బెన: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యనందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. వసతి గృహంలో కలెక్టర్ నిద్ర కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి మండలంలోని గోలేటి విలేజ్‌లో గల ఐటీడీఏ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి నిద్రించారు. అంతకు ముందు తరగతి గదులతోపాటు డార్మెంటరీ, స్టోర్ రూంలు పరిశీలించారు. నాణ్య మైన భోజనం మెనూ ప్రకారం అందిస్తురా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సీఎం ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని వసతిగృహాలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు. అదనపు కలెక్టర్ నుంచి ఎంపీడీవో వరకు అధికారులందరూ వసతిగృహాలను తనిఖీ చేస్తారని అన్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో డీడీ రమాదేవి, ఏటీడీవో శ్రీనివాస్, జీసీడీవో శకుంతల, తహసీల్దార్ సూర్యప్రకాశ్, ఎంపీడీవో శంకరమ్మ, ఎంపీవో వాసుదేవ్, రవీందర్, హెచ్‌ఎం రవీందర్‌లు పాల్గొన్నారు.

## ‘రైతులపై దౌర్జన్యం సరికాదు’



పంటలు పరిశీలిస్తున్న కోనేరు కోనప్ప

బెజ్జూర్: రైతులపై దౌర్జన్యం చేయడం సరికాదని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. గురువారం తలాయి, తిక్కపల్లి, పాపన్నపేట, సోమిని, భీమారం గ్రామాలకు చెందిన రైతుల పంట పొలాలను పరిశీలించారు. ప్రతిఏటా ప్రాణహిత ఉప్పొంగి వేల ఎకరాల్లో రైతులు పంటలు నష్టపోతున్నారని, ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చింతలమానేపల్లి మండలం దిందా గ్రామానికి చెందిన డగే సురేశ్ అనే రైతు దిందా గ్రామంలో ఇల్లు కడుతుండగా అటవీ అధికారులు బెదిరించారని, అతడిని బలవంతంగా రహస్య ప్రాంతానికి ఎందుకు తరలించారని ప్రశ్నించారు. ఈ ఘటనపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి, అటవీ శాఖ మంత్రి స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏమైనా నేరం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్యవైశ్య సంఘం యూత్ అధ్యక్షుడు పుల్లూరి సతీష్ కుమార్, సిడం సరారాం, నరేందర్ గౌడ్, లంగారి శ్రీనివాస్, శేఖర్, ఇస్తారి, డోకె వెంకన్న, మానుకయ్య, అనిల్ ఉన్నారు.

### అందుబాటులో యూరియా

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉందని ఏవో రామకృష్ణ గురువారం తెలిపారు. ఇప్పటి వరకు 20వేల బస్తాల యూరియాను సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎరువుల కొరత లేకుండా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని, రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు.

## రైతుల సమస్యలపై దృష్టి సారించాలి



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

బెజ్జూర్: రైతుల సమస్యలపై దృష్టి సారించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బుస సారయ్య అన్నారు. మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన లెండెగూరే భీంరావు బుధవారం రాత్రి తన వ్యవసాయ చేనులో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బీఆర్‌ఎస్ నాయకుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు నాయకులతో కలిసి గురువారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అంతిమ సంస్కారాల కోసం ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ యూత్ ఉపాధ్యక్షుడు బర్ల దేవన్న, ఆర్‌ఎస్‌పీ ఆర్మీ టీం కిషోర్, కార్తీక్, బర్ల దేవన్న ఉన్నారు.

## ‘పెండింగ్ డీఏ విడుదల చేయాలి’



సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

సిర్పూర్(టి): పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సునార్కర్ అనిల్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025 సంవత్సరానికి సంబంధించిన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సీపీఎస్ విధానం రద్దు, జెడ్పీజీపీఎఫ్ నిధుల విడుదల తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో నూతన సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మేడి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎల్లాల శ్రీకాంత్, దొంతి రాజు, వేణుగోపాల్, ప్రకాష్, శ్రావణ్, పురుషోత్తం, దుర్గం అనిల్ పాల్గొన్నారు.

## సామాజిక తనిఖీలో వెలుగు చూసిన అక్రమాలు



మాట్లాడుతున్న డీఆర్‌డీవో దత్తారావు

ఆసిఫాబాద్‌అర్బన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఆసిఫాబాద్ మండలానికి సంబంధించిన 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం ఎంపీడీవో కార్యాలయంలో డీఆర్‌డీవో దత్తారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అక్రమాలు జరిగినట్లు వెలుగులోకి వచ్చాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 506 పనులకు సంబంధించిన కూలీల ఖర్చు 83,31,10,866, మెటీరియల్ ఖర్చు 2,38,033,939 కాగా 27 పంచాయతీలకు సంబంధించిన నివేదికలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు చదివి వినిపించారు. ఫెనాల్టీలు రూ.1,21,000, రూ. 83 వేల రికవరీ డీఆర్డీఏ ఆదేశించారు. సాలెగూడ క్షేత్ర సహాయకుడు అజయ్‌కుమార్, సాంకేతిక సహాయకుడైన రవీందర్ కూలీల వద్దనుంచి డబ్బులు వసూలు చేసినట్లు అభియోగం రావడంతో విధుల నుంచి సస్పెండ్ చేశారు. కొలతల్లో వ్యత్యాసం, పని చేయకుండానే పేమెంట్, అప్పపెల్లి కాలువ పూడికతీత పనిలో తేడా రావడంతో క్షేత్రసహాయకుడు కేశవ్, సాంకేతిక సహాయకుడు జయవంత్‌రావ్ సస్పెన్షన్‌కు ఆదేశించారు. జెడ్పీసీఈవో లక్ష్మీనారాయణ, స్టేట్ మేనేజర్ వేణు, ఎంపీడీవో శ్రీనివాస్, క్వాలిటీ కంట్రోల్ అధికారి రమేశ్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి ఆంజనేయులు, హెచ్‌ఆర్ మేనేజర్ మల్లేశ్, సిబ్బంది రవి, బుచ్చన్న, చంద్రశేఖర్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల మరమ్మతులు చేపట్టాలి



మాట్లాడుతున్న భూపాల్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో గుంతలు ఏర్పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదని, ప్రధాన కాలువపై ఆక్రమణలు పెరిగిపోయాయని ఆరోపించారు. జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మాస్టర్ ప్లాన్ అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, సభ్యులు ముంజం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సరిపడా యూరియా అందించాలి



వివరాలు తెలుసుకుంటున్న ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: జిల్లాలోని రైతులకు సరిపడా యూరియా అందించాలని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని మార్కెట్ యార్డులో గురువారం యూరియా కోసం క్యూలో ఉన్న రైతులతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ వర్షంలో సైతం మహిళా రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. యూరియా సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. మార్కెట్ యార్డులో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు, యూత్ కన్వీనర్ రాజు, పట్టణ అధ్యక్షుడు ముస్తాఫీజ్, అంజన్న, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా దేశీదారు దందా

- నిఘా కళ్లు గప్పి స్మగ్లింగ్ చేస్తున్న వైనం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



పోలీసులు పట్టుకున్న దేశీదారు (ఫైల్)

కౌటాల: జిల్లాలో తాగునీరు దొరకని గ్రామాలు ఉన్నాయి కానీ, మద్యం దొరకని చోటు లేదు. జిల్లాలోని బెల్ట్‌షాపుల్లో మహారాష్ట్ర మద్యం ఏరులై పారుతోంది. కట్టడి చేయాల్సిన ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖలు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేశీదారు అమ్మకాలకు ముకుతాడు వేయడంలో అధికారులు విఫలం అవుతున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కొందరు అక్రమార్కులు తమ అక్రమ దందాకు తెరలేపారు. సిర్పూర్(టి) నియోజవర్గం మహారాష్ట్ర సరిహద్దులో ఉండటం, చంద్రపూర్ జిల్లా అనుకుని ఉండటం వారికి కలిసి వస్తోంది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్లలో మొత్తం 32 మద్యం దుకాణాలు, మూడు బార్లు ఉన్నాయి. ఏటా వీటి ద్వారా సుమారు రూ. 250 కోట్ల మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.

**మనోళ్లకు మహా కిక్కు..**

మద్యానికి బానిసై తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని జిల్లాలోని కాగజ్‌నగర్ మండలం చింతగూడ గ్రామానికి చెందిన మహిళలు గ్రామంలోని బెల్ట్ షాపులను మూసి వేయాలని ఆందోళనలు నిర్వహించడంతో పాటు అబ్కారీశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అలాగే కౌటాల మండలం కన్నెపల్లి, గుడ్లబోరి గ్రామాల్లో మద్యపాన నిషేధంపై మహిళలు తీర్మానం చేశారు. బెల్ట్ షాపుల్లో మద్యంతో పాటు దేశీదారు లభిస్తుంది. మహారాష్ట్రలో చీప్ లిక్కర్‌గా పరిగణిస్తున్న దేశీదారు వెరైటీని ఇక్కడి మద్యం ప్రియులు అమితంగా ఇష్టపడుతారు. దీంతో దేశీదారు అక్రమ రవాణా జోరుగా సాగుతుంది.

**నాటు పడవల్లో...**

తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దున పెన్‌గంగ, వార్ధా, ప్రాణహిత నదుల పరీవాహక ప్రాంతం మీదుగా.. నిత్యం జిల్లాలో దేశీదారు దందా యథేచ్ఛగా సాగుతోంది. పట్టించుకునే వారు లేకపోవడంతో కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి, గుండాయిపేట్, వీర్దండి, తాటిపల్లి, సాండ్‌గాం, వీరవెల్లి, చింతలమానెపల్లి మండలంలోని రణవెల్లి, దిందా, గూడెం, బెజ్జూర్ మండలంలోని సోమిని, తలాయి గ్రామాల సమీపంలోని ప్రాణహిత, వార్ధా నదులలో పడవ ద్వారా మహారాష్ట్రలోని సరిహద్దు గ్రామాలకు వెళ్లి దేశీదారును ఆయా మండలాలకు తరలిస్తున్నారు. అక్కడ నుంచి పట్టణాలకు సైతం తరలిస్తున్నారు. అబ్కారీ శాఖ అధికారులు కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో గత ఆరు నెలలో రూ. 1.50 లక్ష విలువ గల 350 లీటర్లకు పైగా దేశీదారును పట్టుకుని పలువురిపై కేసులు నమోదు చేశారు. కౌటాల మండలం తుమ్మిడిహెట్టి ప్రాణహిత నదిలో నాటు పడవలో తరలిస్తున్న రూ. 1.80 లక్షల విలువైన 20 బాక్సుల దేశీదారును పోలీసులు పట్టుకుని ముగ్గురి పై కేసులు నమోదు చేశారు. దేశీదారు మద్యం అక్రమ రవాణాపై అధికారులు నిఘా ఉంచి అరికట్టాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

### కేసులు నమోదు చేస్తాం..



అక్రమంగా మద్యం రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తాం. మన జిల్లాలో దేశీదారు మద్యం నిషేధం ఉంది. మహారాష్ట్ర నుంచి గ్రామాలకు దేశీదారు తరలించే జలమార్గాలు, రైలు, రోడ్డు మార్గాల పై ప్రత్యేక దృష్టి సారించాం. దేశీదారు తరలిస్తున్న పలువురుని పట్టుకొని కేసులు నమోదు చేసి బైండోవర్ చేస్తున్నాం.

– రవి, ఎక్సైజ్‌శాఖ సీఐ, కాగజ్‌నగర్

## ముంచెత్తిన వరద



ద్వారకానగర్ కాలనీలో రోడ్డుపై వర్షపు నీరు



ప్రధాన మార్కెట్ రోడ్డుపై వరద



జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో వరద

జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో గురువారం ఉదయం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. గంటలపాటు జనజీవనం స్తంభించింది. జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ, పైకాజీనగర్ పాటు పలు ప్రాంతాల్లో వర్షపు నీటితో డ్రెయినేజీలు నిండి వరద రోడ్లపై ప్రవహించింది. తోతట్టు ప్రాంతాల్లోకి వరద చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగజ్‌నగర్ పట్టణంలోని పలు కాలనీల్లో మోకాళ్లలోతు వరద చేరింది. సంజీవయ్యకాలనీ, ద్వారకానగర్, శ్రీకృష్ణకాలనీ, సర్‌సిల్క్ కాలనీ, మార్కెట్ ఏరియాతోపాటు తదితర కాలనీలను నీరు ముంచెత్తింది. రోడ్లన్నీ చెరువులను తలపించాయి.

– ఆసిఫాబాద్/కాగజ్‌నగర్‌టౌన్

## జీవో 49 రద్దు చేయాలి

బెజ్జూర్: కుమురం భీం జిల్లా టైగర్ కన్జర్వేషన్ రిజర్వు జీవో 49ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో జీవో ప్రతులను దహనం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని 339 గ్రామాల ఆదివాసీలను అడవి నుంచి వెళ్లగొట్టే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. అనేక సమస్యలపై నిరంతరం ఉద్యమాలు చేస్తూ, పోరాటాలు చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యలను పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. అడవులనే నమ్ముకుని అడవుల్లో జీవిస్తున్న ఆదివాసీలను వెళ్లగొట్టడం కుట్రలో భాగమేనని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గౌరవ అధ్యక్షుడు సిడం సకారాం, కొడప పుల్లయ్య, నైతం సత్తయ్య, మడప శ్రీనిస్, గవుడే గంగారాం, మేకల శ్యామ్ రావు, ఎడ్ల మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899